ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 18.03.2026 సమయం. 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. మూసీ తీరంలో అపరిశుభ్ర వాతావరణంలో మగ్గుతున్న వేలాది కుటుంబాల జీవన స్థితిగతులను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

2. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు డీపీఆర్ పేరుతో ప్రభుత్వం ప్రజలను తప్పు దారి పట్టిస్తోందని బీఆర్ఎస్ ఆరోపించింది.

3. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఐపీహెచ్ఎస్ ప్రమాణాల ప్రకారం వైద్య పరికరాలు సమకూరుస్తున్నట్లు ఆ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్ చెప్పారు.

4. ఖమ్మం నగరపాలక సంస్థ 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను 196 కోట్ల రూపాయల అంచనాలలో బడ్జెట్ ను ప్రతిపాదించింది.

----------------------------

**మూసీపై భట్టి విక్రమార్క**

మూసీ నది ప్రక్షాళన కేవలం అందం కోసం కాదని, అది పేదల జీవితాల్లో వెలుగులు నింపే ఒక మహా యజ్ఞమని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క  స్పష్టం చేశారు. దశాబ్దాలుగా మురుగు కూపంలో, అపరిశుభ్ర వాతావరణంలో మగ్గుతున్న వేలాది కుటుంబాల జీవన స్థితిగతులను మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన  ఈ రోజు శాసనసభలో వివరించారు. మూసి

పునర్జీవంపై చర్చ సందర్భంగా మాట్లాడుతూ... బాపు ఘాట్ నుండి ఉస్మాన్ సాగర్ వరకు మూసీని మణిహారంగా మారుస్తూ, నదిలోకి వచ్చే ప్రతి నాలా వద్ద ఎస్టీపీలను ఏర్పాటు చేసి స్వచ్ఛమైన నీటిని ప్రవహింపజేస్తామని తెలిపారు.ఈ నదీ పరివాహక ప్రాంతంలో ఇళ్లు కోల్పోయే ప్రతి పేద కుటుంబానికి, వారికి పట్టా ఉన్నా లేకపోయినా, అదే ప్రాంతంలో అత్యాధునిక అపార్ట్‌మెంట్లు నిర్మించి ఇస్తామన్న ప్రభుత్వం ప్రకటనను గుర్తు చేశారు. వారికి ఇళ్లతో పాటు అక్కడి మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చి ఆర్థికంగా బలోపేతం చేస్తామని, వారి పిల్లల కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

**బైట్ - భట్టి విక్రమార్క**

పిటిసి, హైదరాబాద్

-----------------------

**మూసీపై కేటీఆర్**

_మూసీ పునర్జీవం ప్రాజెక్టు డీపీఆర్ పేరుతో ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని బీఆర్ఎస్ సభ్యుడు కె.తారక రామారావు విమర్శించారు. 18 నెలలు పడుతుందని జనవరిలో ప్రకటించిన డీపీఆర్, రెండు నెలల్లోనే ఎలా పూర్తయ్యిందని ప్రశ్నించారు. అదీగాక, పాకిస్థాన్‌లో రెడ్ కార్నర్ నోటీసులు ఎదుర్కొంటున్న సంస్థకు ఈ కాంట్రాక్ట్ ఎలా ఇస్తారని నిలదీశారు. 10 వేల ఇళ్లు కూలిపోతాయని గెజిట్ చెబుతుంటే, మంత్రి కేవలం 1400 అని అబద్ధాలు ఆడుతున్నారని ఆరోపించారు.

**బైట్ - కేటీఆర్**

తారకరామారావు వ్యాఖ్యలకు మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ, మురికి కూపంగా మారిన మూసీని అభివృద్ధి చేస్తుంటే విపక్షంఎందుకు అడ్డుకుంటోందని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం కొత్తగా బఫర్ జోన్ నిర్ణయించలేదని, గత ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారమే ముందుకు వెళుతున్నట్లు స్పష్టం చేశారు. ప్రాజెక్టు తొలి దశ అంచనా వ్యయం 7 వేల కోట్ల

రూపాయలని,  గత నెలలోనే డీపీఆర్ పూర్తయిందని వెల్లడించారు. నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారం పరిహారం, టీడీఆర్ ఇస్తామని భరోసా ఇచ్చారు.

**పిటిసి, హైదరాబాద్**

-----------------------------------

**బీఆర్ఎస్   వాకౌట్**

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై   ప్రభుత్వం అందిస్తున్న గణాంకాలు అవాస్తవమని, ప్రాజెక్టు ముసుగులో పేదల ఇళ్లను కూల్చేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభను బహిష్కరించారు. మంత్రి శ్రీధర్ బాబు డీపీఆర్ వివరాలను వెల్లడిస్తున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ స్పీకర్ పోడియం వద్ద నిరసన తెలిపారు. తమకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని విమర్శిస్తూ వారు వాకౌట్ చేశారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ... కేవలం రెండు నెలల్లో డీపీఆర్ ఎలా సిద్ధమవుతుందని ప్రశ్నించారు. వేలాది కుటుంబాలను రోడ్డున పడేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, మైకులు కట్ చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు.

**డెస్క్**

-----------------------------

**బడ్జెట్ సమావేశాలు**

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఐపీహెచ్ఎస్ ప్రమాణాల ప్రకారం వైద్య పరికరాలను ప్రామాణీకరిస్తున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్ చెప్పారు. ఆసుపత్రుల్లో పడకల సంఖ్యను బట్టి బడ్జెట్ లో కేటాయింపులు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈరోజు శాసనసభలో సభ్యులు డాక్టర్ సంజయ్, మధుసూధన్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్తూ... నిజామాబాద్, సిద్దిపేట వంటి ప్రాంతాల్లో అత్యాధునిక 3

టెస్లా MRI, 128 స్లైస్ CT మిషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ప్రతి 30 నుంచి 40 కిలో మీటర్లకు ఒకటి చొప్పున 107 లెవెల్ 3 ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి రాజనర్సింహ్ వివరించారు.

**పీటీసీ - హైదరాబాద్**

--------------------

పొన్నం ప్రభాకర్

రాష్ట్రంలో మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ పురోగతి, మహిళా సంక్షేమంపై ఈరోజు శాసన మండలిలో మాట్లాడుతూ, రాష్ట్రంలో 600 బస్సులకు మహిళలనే యజమానులను చేసినట్లు ప్రకటించారు. మహిళా యజమానులు అన్ని ఖర్చులు పోను నెలకు 70 వేల రూపాయల నికర ఆదాయం గడిస్తున్నారని వెల్లడించారు. బస్ స్టేషన్లలో మౌలిక వసతుల కోసం 100 కోట్ల రూపాయలు కేటాయించామని, ఏటూరునాగారం, పెద్దపల్లిలో కొత్త డిపోలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇక విధి నిర్వహణలో కార్మికులు మరణిస్తే వారి కుటుంబాలకు కోటి రూపాయల భీమా అందేలా చారిత్రాత్మక ఒప్పందం చేసుకున్నట్లు మంత్రి చెప్పుకొచ్చారు.

పీటీసీ - హైదరాబాద్

--------------------------

**బాసర ట్రిపుల్ ఐటి**

బాసర ట్రిపుల్ ఐటిలో 2014 నుంచి అక్రమాలు జరిగినట్లుగా వస్తున్న ఆరోపణలపై ధర్యాప్తు విచారణ చేపట్టాలని ముథోల్ శాసనసభ్యుడు పవార్ రామారావు పటేల్ డిమాండ్ చేశారు. ఆ విద్యా సంస్థలోని సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపడం లేదని ఆయన ఈరోజు శాసన సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ప్రస్తావించారు. అక్కడి విద్యార్థులకు మౌలిక సదుపాయాలు లేవని ఆరేళ్ల క్రితం అప్పటి ఐటీ మంత్రి కె. తారాక రామరావు కొన్ని కంప్యూటర్లు మాత్రమే అందజేశారని ఆయన గుర్తు చేశారు.

**పీటీసీ – నిర్మల్**

--------------------------------

**ఖమ్మం**

ఖమ్మం నగరపాలక సంస్థకు 2026-27 ఆర్థిక సంవత్సరానికి 196 కోట్ల రూపాయల అంచనాలతో బడ్జెట్ ను ప్రతిపాదించినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చెప్పారు. ఈరోజు జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నగరంలో వీధి దీపాల నిర్వహణ కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లను పొందినవారు వాటి నిర్మాణాన్ని ప్రారంభించకపోతే అర్హులైన ఇతరులకు కేటాయిస్తామని చెప్పారు. ఆ మేరకు గృహ నిర్మాణ సంస్థ అధికారులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని సూచించారు.

**పీటీసీ – ఖమ్మం**

--------------------------------

**ఎస్ ఎస్ సీ పరీక్షలు**

పదవ తరగతి పరీక్షలు నేడు రెండవ రోజు ప్రశాంతంగా ముగిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల 16 వేల 940 మంది అభ్యర్థులకు గాను, 5 లక్షల 15 వేల 672 మంది పరీక్షలకు హాజరైనట్లు ప్రభుత్వ పరీక్షల సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. 99.75 శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 2 వేల 676 కేంద్రాల్లో పరీక్షలు కొనసాగుతున్నాయి.

**పీఎస్**

-------------------------------

**రైతు ఉత్సవాలు**

సిద్దిపేట జిల్లా నర్మెట్టలో రేపు రైతు ఉత్సవాలు ప్రారంభమవుతాయి. నాలుగు రోజుల పాటు కొనసాగుతాయి. ఈ సందర్భంగా ఏర్పాటయ్యే 150 స్టాళ్లను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రేపు సాయంత్రం 4 గంటలకు ప్రారంభిస్తారు. ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ కర్మాగారం ఈ నెల 22వ తేదీన ప్రారంభమవుతుంది.

**పీఎస్**

--------------------------------

**ఉగాది గవర్నర్**

శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉగాది పచ్చడి జీవితంలో విభిన్న పరిస్థితులకు ప్రతీక అని, నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఆశావాదంతో ఎదుర్కొనేందుకు ఈ పండుగను స్ఫూర్తిదాయకంగా తీసుకుందామని ఆయన ఒక సందేశంలో పేర్కొన్నారు. ఈ పండుగ సమాజంలో శాంతి, సౌభాగ్య, సామరస్యాలను అందించగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**పీఎస్**

----------------------------

**ఎల్పీజీ అవగాహన**

వనపర్తి జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ పైప్ లైన్ వెళ్లే ప్రదేశాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి రైతులకు సూచించారు. గ్యాస్ పైప్ లైన్ వేసిన పంట పొలాల రైతులకు అవగాహన కలిగించేందుకు కమిటీని ఏర్పాటు చేశామని, దీని ద్వారా సమావేశాలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. గ్యాస్ లీకేజీ వల్ల ఎదురయ్యే ప్రమాదాలు నివారించడం వాటి పట్ల సత్వర స్పందించడం అనే అంశాలపై ఈరోజు మాక్ డ్రిల్ నిర్వహించారు.

**బైట్ - కలెక్టర్**

**పీటీసీ - వనపర్తి**

--------------------------------

**పారిశుద్ధ్యం – సిరిసిల్ల**

పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రజలు సహకరించాలని తడి, పొడి చెత్తను వేరువేరుగా పారిశుద్ధ సిబ్బందికి అందజేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్

సూచించారు. వేములవాడ మండలం తెట్టెకుంట శివారులో నూతనంగా సమకూర్చిన చెత్త శుద్ధి యంత్రాలను ఆమె ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ....

**బైట్ – కలెక్టర్**

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

--------------------------------

**భూ సమస్యలు**

సంగారెడ్డి జిల్లాలో భూ వివాదాలు తగ్గించి రైతులకు స్పష్టమైన హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం సమగ్ర భూ సర్వే చేపట్టిందని కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. రోవర్ సాంకేతికతను వినియోగించి భూములకు ఖచ్చితమైన హద్దులు నిర్ణయిస్తామని సంగారెడ్డి జిల్లాల వల్లూరు గ్రామంలో రైతుల అవగాహన సదస్సులో ఈ రోజు చెప్పారు. రైతులు తమ భూములను స్వచ్ఛందంగా తిరి సర్వే చేయించుకుంటే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది కలెక్టర్ అన్నారు.

**పీటీసీ – సంగారెడ్డి**

-----------------------------------

**భూ సర్వే – ములుగు**

ములుగు జిల్లాలో భూములను తొమ్మిది బ్లాకులుగా విభజించి తొమ్మిది బృందాలతో రీ సర్వే నిర్వహిస్తామని కలెక్టర్ దివాకర్ టి.ఎస్ తెలిపారు. మల్లంపల్లి మండలం రామచంద్రాపురం గ్రామంలో ఈరోజు జరిగిన రైతు సభలో ఆయన మాట్లాడుతూ.... ఈ సర్వే విజయవంతం కావడానికి గ్రామస్తులు, రైతులు సహకరించాలని కోరారు. రామచంద్రాపురంలో 10 వేల 500 ఎకరాల భూములను రీసర్వే చేయించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన చెప్పారు.

**పీటీసీ – ములుగు**

----------------------------------

**జగిత్యాల – పులి**

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలో రెండు రోజులుగా పులి సంచరిస్తున్నట్లు సీసీ కెమెరాలో నమోదైందని, దాని కదలికలపై నిఘా ఉంచామని జిల్లా అటవీ శాఖ అధికారి రవి ప్రసాద్ తెలిపారు. దానిని మహారాష్ట్రకు చెందిన జే-1 టైగర్ గా గుర్తించినట్లు చెప్పారు. పులిని బంధించేందుకు మూడు ప్రత్యేక బృందాలను నియమించినట్లు తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చిరించారు.

**పీటీసీ – జగిత్యాల**

---------------------------------

**ఎల్పీజీ - మెదక్**

మెదక్ లో అక్రమంగా వినియోగిస్తున్న 52 గృహ వినియోగ వంట గ్యాస్ సిలిండర్లను పౌర సరఫరాల శాఖ నిఘా అధికారుల పట్టుకున్నారు. ఎల్పీజీ సిలిండర్ల అక్రమ వినియోగాన్ని అరికట్టేందుకు తనిఖీలు చేపట్టామని, గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు తేలిందని జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్ తెలిపారు. నిందితులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

**పీటీసీ - మెదక్**

---------------------------------